# ఇందిరమ్మ ఇళ్లు..
# రాజకీయ రంగు

## రాజకీయాల సుడిగుండంలో "ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు"

### అర్హులకు అన్యాయం...?

**దారితప్పిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు**

**అర్హులను కాదని, పార్టీ అనుచరులకే ఇళ్లు..?**

**ఎమ్మెల్యే, మంత్రుల ఆదేశాలతో పత్రాల నిలుపుదల..!**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రంలో తీవ్ర విమర్శలపాలవుతోంది. అట్టి ఆరోపణలకు ఆయువుపోస్తున్నట్లుగా తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలం, కొత్తపల్లి (కె) లో జరిగిన సంఘటన అద్దం పట్టినట్లు చెప్పవచ్చు. పథకం అమలు దారితప్పిందని, నిజమైన లబ్ధిదారులను కాదని రాజకీయ జోక్యంతో పార్టీ అనుచరులకే పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలను.. ఈ ఘటన బలపరుస్తున్నది. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కుమ్మక్కై అర్హులకు అన్యాయం చేస్తున్నారనడానికి ఈ సందర్భం ఒక ఉదాహరణగా నిలుస్తున్నది.

ప్రభుత్వ సర్వేలో ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు అర్హులుగా గుర్తించినప్పటికీ, రాజకీయ నాయకుల జోక్యంతో తమ మంజూరు పత్రాలను నిలిపివేశారని, దీంతో నిజమైన పేదలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని కొత్తపల్లి (కె) గ్రామానికి చెందిన జవ్వాజి సుమలత (భర్త రమేష్) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ అనుచరులకే పెద్దపీట వేస్తోందనడానికి తమ సమస్యే నిదర్శనమని బాధిత కుటుంబం వాదిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో ఉన్నతాధికారులు సైతం స్థానిక శాసనసభ్యులు, ఇన్‌చార్జి మంత్రులకు తొత్తులుగా మారిపోయారని సుమలతతో పాటు స్థానికులు కూడా విమర్శిస్తున్నారు.






### అధికారులు - ప్రజాప్రతినిధుల కుమ్మక్కు?

నిరుపేదలకు న్యాయం చేయాల్సిన అధికారులు, ఎమ్మెల్యేకు తొత్తుగా మారారనడానికి నా సమస్యే నిదర్శనమని సుమలత కుటుంబం వాపోతోంది. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అధికార పార్టీ కార్యకర్తలకు, అనర్హులకు పత్రాలు ఇచ్చే కార్యక్రమంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. న్యాయం కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వంలో ఉన్న కీలక వ్యక్తుల ఆదేశాల మేరకే అర్హత ఉన్న తమ పత్రాన్ని నిలిపివేశామని అధికారులు చెప్పడం, ఆ తర్వాత ఎమ్మెల్యే అహంకారపూరితంగా సమాధానం ఇవ్వడం చూస్తుంటే, తెలంగాణలో నిజమైన ప్రజా పాలన జరుగుతుందా? లేదా పార్టీ పాలన నడుస్తోందా? అనే ప్రశ్న తలెత్తుతోందని సుమలత అన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొత్తపల్లి (కె) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ విషయంలో అధికార పార్టీ నాయకుల జోక్యం, ఎమ్మెల్యే అహంకార ధోరణిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడిసెల్లో, రేకుల షెడ్లలో నివసిస్తున్న పేదలకు దక్కాల్సిన ఇళ్లు, కేవలం రాజకీయ ఆదేశాల కారణంగా ఆగిపోయాయని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.

### అధికారుల సర్వే నిర్ధారణ.. పత్రాల నిలుపుదల

**"మీరు అర్హులే, మంజూరు చేస్తాం!"**


కొత్తపల్లి (కె) గ్రామానికి చెందిన జవ్వాజి సుమలత కుటుంబాన్ని, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ సర్వేలో భాగంగా హౌసింగ్ పీడీ, మండల గెజిటెడ్ అధికారి, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి బృందం పరిశీలించింది. తమ ఇల్లు నిరుపేద స్థితిలో ఉందని నిర్ధారించుకున్న అధికారులు, మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సుమలత కుటుంబానికి ఇల్లు మంజూరు అయినట్లుగా ఎంపీడీఓ లాగిన్‌కు అధికారిక పత్రం కూడా వచ్చిందని, కానీ గ్రామాలలో మంజూరు పత్రాలు పంపిణీ చేసే సమయానికి వారి పత్రాన్ని నిలిపివేశారు.

### సమాచార హక్కు చట్టంలో బయటపడిన నిజం

తమ మంజూరు పత్రం నిలుపుదలకు కారణం తెలుసుకోవడానికి సుమలత భర్త రమేష్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓను సంప్రదించినా సరైన సమాధానం రాలేదు. దీంతో వారు సమాచార హక్కు చట్టం (%=×%) 2005 ద్వారా ఎంపీడీఓకి దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ స్పందించకపోవడంతో, జిల్లా పరిషత్ సీఈఓకి అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌కు స్పందించిన అధికారులు, కొత్తపల్లి గోరి మండల ఎంపీడీఓ ద్వారా రిజిస్టర్ పోస్టులో సమాచారం పంపించారు. ఆ సమాచారంలో ఉన్న వివరాలు షాక్‌కు గురిచేశాయి..

"మీరు ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో మొదటి విడతలో అర్హులే అని.. మంజూరు పత్రం నా ఎంపీడీఓ లాగిన్‌కు వచ్చి ఉన్నది.. కానీ గ్రామాల వారీగా పంపిణీలో భాగంగా భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణల ఆదేశాల అనుసారం మీయొక్క ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాన్ని నిలిపివేశాము." (అనేది దరఖాస్తుకు సమాధానం)

అర్హుల జాబితాలో ఉన్నప్పటికీ, రాజకీయ నాయకుల ఆదేశాల మేరకు మంజూరు పత్రాన్ని ఆపివేశామని స్వయంగా మండల అధికారి RTI ద్వారా తెలియజేయడం ప్రజా పాలనపై తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తోంది.


మండల ప్రజా పరిషత్ కార్యాలయము, కొత్తపల్లిగోరి.

### జవ్వాజి సుమలత (బాధితురాలు) ఆవేదన:



"ప్రొసీడింగ్ లెటర్ వచ్చిన తర్వాత కూడా ఎమ్మెల్యే ఆదేశాలతో మా ఇల్లు ఆపారు. ముఖ్యమంత్రికి చెప్పుకున్నా ఇవ్వనన్నారు!"


తాను గత 15 సంవత్సరాలుగా కమ్మలతో కట్టిన గుడిసెలో, ఆపై రేకుల షెడ్‌లో నివసిస్తున్నానని, తమకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని జవ్వాజి సుమలత గద్గద స్వరంతో తెలిపారు. సర్వే చేసిన అధికారులు, హౌసింగ్ పీడీ సహా అందరూ మా ఇంటిని చూసి, మేము ఇందిరమ్మ ఇళ్లకు అర్హులమని మొదటి విడతలోనే మంజూరు చేశారని ఎంపీడీఓ లాగిన్‌కు పత్రం కూడా వచ్చిందని తెలిపారు. అయితే, ఎమ్మెల్యే మంజూరు పత్రాలు పంపిణీ చేసే రోజున మా పేరును నిలిపివేశారు. ఎందుకు ఆపారో అని అధికారులను అడిగినా చెప్పలేదు. మేము సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేస్తే, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆదేశాల మేరకే ఆపినట్లు ఎంపీడీఓ సార్ సమాధానంగా లెటర్ పంపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణని నిలదీస్తే, మీరు క్యాంప్ ఆఫీస్‌కు రండి, ఇస్తాను అని నమ్మించి, అక్కడికి వెళ్తే మీరు బీఆర్ఎస్ పార్టీ, మీకు ఇల్లు ఇవ్వము. మా ప్రభుత్వంలో మీకు ఇల్లే రాదు అని సీరియస్‌గా మాట్లాడారు. ముఖ్యమంత్రికి చెప్పుకున్నా ఇవ్వనని అహంకారంగా సమాధానం ఇచ్చారు. మా వారు (సుమలత భర్త) అక్రమ పట్టాలపై పోరాడినందుకు, గండ్ర జ్యోతి మేడమ్‌తో కలిసి పాదయాత్రకు వెళ్లినందుకు మాపై కక్ష పెంచుకొని మరీ ఇల్లు రాకుండా చేశారు. తెలంగాణ కోసం పోరాడిన యోధులకు ఇండ్లు ఇవ్వకపోవడం ఎంతవరకు న్యాయం? దయచేసి అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు పత్రాలు అందించి, కట్టుకోడానికి సహకరించాల్సిందిగా మనవి.

### మల్లయ్య (గ్రామస్తుడు) వాదన:



ఇల్లు లేని వారికి ముందు ఇల్లు ఇవ్వాలి. పందిరేసుకుని ఉన్నోళ్లకు ఇల్లు ఎందుకు రాదు?.. ఇల్లు లేనివాళ్లకి, గుడిసెల్లో కమ్మలు, పాతరేకులు వేసుకొని ఉన్నవాళ్లకి ఫస్ట్ ఇల్లు ఇవ్వాలి. కానీ, పేర్లు వచ్చిన తర్వాత ఆపడమేంటి.. సుమలత పేరు లిస్ట్‌లో ఉంది. కానీ, ఆపేశారు. కారణం అడిగితే పార్టీ ఆదేశాలు అని చెప్తున్నారు. అసలు ఇల్లు ఎట్లా, ఏ పద్ధతిలో ఇయ్యాలి? నిజమైన అర్హులకు ఎందుకు ఇవ్వట్లేదు? ఇది నీచ రాజకీయం.

### గోలుకొండ పోషాలు (స్థానికుడు):



జువ్వాజీ సుమలత కుటుంబం పేద కుటుంబం.. వీరికి ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు. ఇల్లు మంజూరైనా ఇవ్వకపోవడం అన్యాయం. బీఆర్ఎస్ వాది కాబట్టి ఇల్లు ఇవ్వమని చెప్పడం న్యాయమేనా?

### సంకటి స్వర్ణ (గ్రామస్తురాలు):



రేపటి కల.. మా సొంటోళ్లకు కూడా ఇట్లనే చేస్తారు అని అడుగుతున్నాను. వీళ్లు మొదట్లో చెట్టు కింద పిల్లలను పట్టుకొని ఉంటే, పాములు వస్తాయి అని చెప్పి, అక్కడి నుంచో.. ఇక్కడి నుంచో తీసుకొని నాలుగు పాత రేకులు వేసుకుని ఉంటున్నారు. వాళ్లకు కచ్చితంగా ఇల్లు రావాలి. ఇది ఇట్లా నేను ఎందుకు అంటున్నానంటే, రేపటికల్ల మా లాంటి పేదోళ్ళకి ఇలాంటి పరిస్థితి ఎదురవ్వొద్దు. న్యాయం కోసం గ్రామస్థులం ఏకం అవుతాం.



### ఎమ్మెల్యే అహంకార ధోరణి

ఈ అన్యాయంపై జవ్వాజి సుమలత కుటుంబం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణని నిలదీశారు. ఈ సందర్భంగా వీడియో ఫుటేజ్ లో రమేష్ కుటుంబం, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ఇతర గ్రామస్తులతో కలిసి, ఎమ్మెల్యేను గట్టిగా ప్రశ్నించడం గమనించవచ్చు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే...

"మీరు ముఖ్యమంత్రికి చెప్పుకొన్నా మీకు ఇల్లు ఇవ్వము" అంటూ అహంకార ధోరణితో మాట్లాడి, అవమానించారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. ఈ ఘటన అధికారులు, ఎమ్మెల్యేల సమక్షంలోనే జరగడం గమనార్హం.

